క్లుప్తంగా

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

షాద్‌నగర్: మండల పరిధిలోని ఉప్పరిగడ్డ, కంసాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ గ్రామ బూత్ కమిటీలను పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పోలింగ్ బూత్ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షులుగా కడావత్ రాజు, ఆవ శివకుమార్, ఆంగోతు గణేశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, నరేశ్ నాయక్, శ్రీను, నిర్మల నరేందర్, శివశంకర్, శ్రీకాంత్, చెన్నయ్య, వంశీ, నవీన్, తుపాకుల కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మరియారాణి పాఠశాల ఆవరణలో త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమకు నచ్చిన క్రీడల్లో రాణించి ప్రతిభ కనబర్చాలన్నారు. క్రీడల్లో పాల్గొనడంతో శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందన్నారు. విద్యార్థులు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్తేమా ఏర్పాట్ల పరిశీలన



ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: పట్టణంలో జనవరి 3, 4, 5 తేదీలలో మూడురోజుల పాటు నిర్వహించే ఇస్తేమా కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. ప్రస్తుతం పూర్తయిన పనులు, ఇంకా పూర్తి కావాల్సిన పనులపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం జరిగే రోజుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు, అధికారులు, నాయకులకు సూచించారు.

అయ్యప్పస్వామికి పూజలు

పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యాదయ్య హాజరై, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రవీణ్‌కుమార్,గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి



ఆలూరులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: కార్మికులు, కర్షకులు, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో మంగళవారం పార్టీ వంద వసంతాల ఉత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతుందని, ఇందుకుగాను పార్టీ అధిష్టానం ఆదేశాలతో గ్రామ గ్రామాన పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు, కర్షకులు, పేద ప్రజల సమస్యలపై పార్టీ ముందుండి పోరాటం చేస్తోందన్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సభలు, ప్రదర్శనలు చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి పోచయ్య, పార్టీ నాయకులు కృష్ణగౌడ్, మంజుల, శివ, నర్సింలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కొత్తూరు: ఫాతీమాపూర్‌లోని చర్చిలో విద్యుద్దీపాలతో అలంకరించిన క్రిబ్



మొయినాబాద్‌లో వెలిగిపోతున్న మెథడిస్ట్ చర్చి



షాబాద్: మరియాపూరం చర్చిలో మొక్కలతో ముస్తాబు

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లోని చర్చిలను నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చిల్లో క్రిస్మస్ ట్రీస్, స్టార్స్, యేసు క్రీస్తు జన్మస్థలం పశువుల పాకలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాస్టర్లు దైవ సందేశం వినిపించనున్నారు.

లక్ష్యం..2.80లక్షల మొక్కలు

వనమహోత్సవానికి సన్నద్ధమవుతున్న అధికారులు

- ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు
- నర్సరీల్లో ముమ్మరంగా మట్టి నింపే పనులు

గ్రామాల్లో పచ్చదనం పెంపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రతి గ్రామంలోని నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనుల్లో ఉపాధి సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇందుకు గాను ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాకాలం నాటికి అవసరమయ్యే మొక్కలను అందుబాటులో ఉంచేలా ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.



హిమాయత్‌నగర్ నర్సరీలో కవర్లలో మట్టి నింపుతున్న సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమానికి ప్రతి గ్రామంలో నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు గాను నర్సరీల్లో ఉపాధి సిబ్బంది పనులు చేపడుతున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలు, ఏడు అనుబంధ గ్రామాల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నర్సరీల్లో మొక్కలు ఎదగడానికి గ్రీన్ షేడ్ నెట్‌లను గత సంవత్సరం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే సంవత్సరం జూన్ నెల నాటికి మొక్కలు సిద్ధం చేసి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సూచించిన మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో విత్తనాలు నాటేందుకు ప్లాస్టిక్ కవర్లలో మట్టిని నింపే పనులు చేపడున్నారు. జూన్ మాసం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రతి పల్లె నర్సరీల్లో టెకు, జామ, సిరి, గులాబీ, కరివేపాకు, కానుగ, మునుగ, వివిధ రకాల మొక్కలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు.

2 లక్షల 80 వేల మొక్కలు లక్ష్యం..

మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామ పంచాయతీకి పది వేల చొప్పున మొత్తం 2.80లక్షల మొక్కలు పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులను ఎన్ఆర్‌జీఎస్ అధికారులతో కలిసి సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్కో నర్సరీ నిర్వహణకు ఉపాధి హామీ నుంచి సుమారుగా 2 లక్షల నిధులు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బందితో కలిసి కవర్లలో మట్టిని నింపే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు..



మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో వచ్చే సంవత్సరం వన మహోత్సవానికి మొక్కలు నాటేందుకు మట్టి నింపే కార్యక్రమం మొదలైంది. ప్రతి గ్రామంలోని నర్సరీలో పది వేల మొక్కలు తగ్గకుండా పెంచేందుకు కృషి చేస్తున్నాం. అదేవిధంగా నాటిన విత్తనాలు మొలకెత్తి సంరక్షణగా ఎదిగేందుకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. వచ్చే వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రజలకు మొక్కలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

-భోయిని సంధ్య, ఎంపీడీఓ

చర్యలు తీసుకుంటున్నాం



ప్రభుత్వ సూచనల మేరకు గ్రామాలలోని నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు అవగాహన కల్పిస్తున్నాం. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇప్పటికే విత్తనాలు నాటేందుకు కవర్లో మట్టి నింపి సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం వచ్చే వర్షాకాలానికి వన మహోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని యోచిస్తోంది. వచ్చే వర్ష కాలం నాటికి నర్సరీలలో మొక్కలు అధికంగా పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ

హామీల పేరుతో మోసం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి



బూత్ కమిటీ అధ్యక్షులకు నియామకపత్రం అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి, తదితరులు

షాబాద్: రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ్ భారత్ కన్వీనర్ రాము పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో 214 బూత్ కమిటీ అధ్యక్షులుగా దాదె రమేశ్, భిక్షపతి, రామకృష్ణ, సునీల్, మల్లేశ్, రఘురాం, శివ, శ్రీకాంత్, అశోక్, శ్రీశైలంను వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో మూటగట్టుకున్న పాపాలను కాంగ్రెస్ సర్కారు ఒక్క ఏడాదిలోనే మూటగట్టుకుందన్నారు. ఏడాది గడిచినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, సీనియర్ నాయకులు మల్లేశ్‌యాదవ్, శ్యామ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అప్పోజీగూడను మున్సిపాలిటీలో కలపాలి

అధికారులకు గ్రామస్తుల వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: అప్పోజీగూడ గ్రామ పంచాయతీని కొత్తగా ఏర్పాటయ్యే మొయినాబాద్ మున్సిపాలిటీలో కలపాలని ఆ గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. మంగళవారం మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంపీడీఓ సంధ్యకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. 2018 వరకు చిలుకూరు గ్రామ పంచాయతీకి అప్పోజీగూడ గ్రామం అనుబంధ గ్రామంగా ఉందని, 2018లో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు సందర్భంగా అప్పోజీగూడ గ్రామ పంచాయతీగా ఏర్పడిందన్నారు. ప్రస్తుతం చిలుకూరు గ్రామ పంచాయతీ మున్సిపాలిటీలో కలుస్తున్నందున అప్పోజీగూడను సైతం మున్సిపాలిటీలో కలపాలని కోరారు. అప్పోజీగూడకు రెవెన్యూ లేదని, చిలుకూరులోని కొన్ని సర్వే నంబర్లను అప్పోజీగూడకు కేటాయించారన్నారు. అప్పోజీగూడ పంచాయతీగా ఉంటే అభివృద్ధి జరగదని, చిలుకూరుతో పాటు మున్సిపాలిటీలో చేర్పితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సురేష్, నాయకులు మల్లేశ్, శ్రీరాములు, రాజు తదితరులు ఉన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: చించోడ్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చించోడ్, దేవునిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడూ తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గత పాలకులు నియంతలా వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో ఎమ్మెల్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

షాద్‌నగర్‌రూరల్: సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాలీబాల్, అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వాలీబాల్‌లో వై.అక్షయ, కౌసల్య, స్ఫూర్తి, అథ్లెటిక్స్‌లో అర్షిత, దేవి, కార్తీక్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శంకర్‌పల్లిలో మంగళవారం పట్టణానికి చెందిన యువకులు ప్రవీణ్, రాము, ఎం.ప్రవీణ్, సత్యనారాయణ, మహేశ్, ఎ.ప్రవీణ్, శేఖర్, సాయిప్రసాద్, సతీశ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేంద్రంలో పీఎం మోదీ అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పార్టీలో చేరిన వారందరికీభవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాములుగౌడ్, పట్టణాధ్యక్షుడు సురేశ్, పట్టణ ఇన్‌చార్జి వాసుదేవ్‌కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

షాబాద్: అయ్యప్ప నామస్మరణతో కేసారం గ్రామం ఆధ్యాత్మికతతో నిండిపోయిందని గురుస్వామి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని కేసారం గ్రామంలో అదే గ్రామానికి చెందిన శ్రీరామ్ స్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మాలదారులు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి భక్తి గీతాలు ఆలపించారు. ఈ పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఎన్.రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు అవసరం

కొందుర్గు: ప్రతి విద్యార్థి యుద్ధ విద్యలో ప్రావిణ్యం పొందాలని ఎస్సై కృష్ణయ్య సూచించారు. షాద్‌నగర్‌లో ఈ నెల 22న నిర్వహించిన రతన్ టాటా మెమోరియల్, సౌత్ ఇండియా కరాటే, కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో కొందుర్గు విద్యార్థులు షఫీన్, వేదాంశ, వైష్ణవి, మేఘన, మైతిలీలు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్సై అభినందించి సత్కరించారు. విద్యార్థులు చదువుతో పాటు యుద్ధ విద్యలో రాణించాలని, యుద్ధ విద్యఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. కరాటేలో శిక్షణతో ఇంకా జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ రమేశ్, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శంకర్‌పల్లి: పట్టణంలోని లిటిల్ స్టార్ పాఠశాలలో మంగళవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్ శ్వేత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, శాంతాక్లాజ్ వేషధారణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. చైర్‌పర్సన్ విజయలక్ష్మి విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి, తినిపించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సంజీత్‌కుమార్, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో రాసింగ్ రెవల్ మినిస్ట్రీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ జాసు కిషోర్, రజనీకాంత్ డేవిడ్ సుధాకర్ పాల్గొని యేసు సందేశం వినిపించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ వేడుకల్లో మాజీ వార్డుసభ్యురాలు సుధాశ్రీధర్, సుందర్‌రాజ్, వినోద్, ప్రవీణ్, నవీన్, శ్రీకాంత్, శేఖర్, జోషువ, సురేశ్, నరేశ్, సంగీత, సంజీవ్, స్వానిదాస్, శ్రీకాంత్, విశ్వనాథ్, మహేశ్, లాజర్ పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: చిన్నారులతో కలిసి కేక్‌కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్‌లో..

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: ప్రజాస్వామ్యానికే మూలస్తంభమైన పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు తరచూ ఉచ్చరించడాన్ని సహించలేకే తన అసహనాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహాయాటంగా బట్టబయలు చేశారని పీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అజీజ్‌నగర్‌లో మాట్లాడుతూ.. రాజ్యాంగ రచయితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ పట్ల చులకనగా మాట్లాడిన అమిత్‌షా భారత జాతికి వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. ఇలాంటి వారిని చట్టసభల్లో ఉండకుండా బర్తరఫ్ చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతీ కార్యకర్త పని చేయాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, చింపుల సత్యనారాయణరెడ్డి, కె.రాజు తదితరులు ఉన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



చేవెళ్లలో పెరియార్ రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో పెరియార్ రామస్వామి నాయకర్ వర్ధంతిని మంగళవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు నాగని ఆర్కేతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహానుభావుడని, మనువాదాన్ని నాశనం చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, సభ్యులు రామకృష్ణ, హానోక్, రమేశ్, శేఖర్, నర్సింలు, అంజయ్య తదితరులు ఉన్నారు.

అందరూ కలిసిమెలసి ఉండాలి

షాబాద్: కుల, మతాలకతీతంగా అందరూ కలిసిమెలసి ఉండాలని పెరియార్ రామస్వామి నాయకర్ ఎంతో కృషి చేశారని తెలంగాణ జన సమితి చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ (ఆర్కే) పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో పెరియార్ ఈవి రామస్వామి నాయకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపీటీసీ పాండు, నాయకులు వెంకట్‌స్వామి, లింగం, వెంకటేశ్, బాల్‌నర్సింహులు, సత్తిరెడ్డి, బాబు, శేఖర్, మల్లేశ్‌చారి ఉన్నారు.